క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా/పెద్దవూర : అనుముల మండలంలోని యాచారం, పెద్దవూర మండలంలోని కొత్తలూరు, వెల్మగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాలునాయక్, పెద్దవూర ఏఈ దాసయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాచారం, కొత్తలూరు, వెల్మగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ తీగలను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 132కేవీ సబ్‌స్టేషన్, హాలియా నుంచి వచ్చే 33కేవీ యాచారం ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. యాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని యాచారం, అన్నారం, మారేపల్లి, వెంకటాద్రిపాలెం, కొసలమర్రి గ్రామాలతో పాటు పెద్దవూర మండల పరిధిలోని కొత్తలూరు, వెల్మగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నీ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, ఎఫ్‌సీఐ వద్ద గల సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో వన్‌టౌన్, టూటౌన్ ఏఈలు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యానగర్, ఆర్‌సీగూడెం, రామచంద్రగూడెం, హౌజింగ్‌బోర్డు, ప్రకాశ్‌నగర్, బాపూజీనగర్, రెడ్డికాలనీ, ముత్తిరెడ్డికుంట, వినోభానగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మాడుగులపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని చెరువుపల్లి, ఇందుగుల, ఆగామోత్కూర్, కన్నెకల్ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 12గంటల 30నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మణిదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ తీగలకు చెట్లు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి శివను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జనార్దన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని అవంతిపురం బీసీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కలకుంటి శివ పంజాబ్‌లోని సంగూర్‌లో ఈనెల 22నుంచి 26 వరకు జరగనున్న జాతీయ జూనియర్ బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్ బిరవోలు జనార్దన్‌రెడ్డి అభినందించారు. ఈనెల 9న కరీంనగర్ జిల్లాలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శివ తెలంగాణ నుంచి ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల పీఈటీ మురహరి తెలిపారు. అదే విధంగా ఉపాధ్యాయులు శివను అభినందించారు.

బీఎస్పీకి పలువురి రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హాలియా : బహుజన సమాజ్ పార్టీకి, సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలేపల్లి రాజేష్, నియోజకవర్గ అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మార్గంలో తాము పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వారితో పాటు పార్టీకి రాజీనామా చేసిన వారిలో కుక్కమూడి ముత్యాలు, ఆదిమల్ల సత్యనారాయణ, రేపాక నర్సింహ, రమేష్ రాథోడ్, రవీందర్, రవికుమార్, మహేందర్, కొమ్ము రమేష్, దాస్, అశోక్ నాయక్, రాము, శ్రీను, జ్యోతి, నరేందర్ తదితరులు ఉన్నారు.

మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలు



నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగనున్న ఎన్నికల్లో భాగంగా గురువారం మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు అసోసియేషన్ ఎన్నికల అధికారి ఏచూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి రెడ్డిపల్లి సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రామకృష్ణ, భాస్కర్ నామినేషన్లు వేశారని, ఈ నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగుస్తుందన్నారు.

పేదలకు అందని ప్రభుత్వ వైద్యం

- ఏరియా ఆస్పత్రిలో వసతులు ఉన్నా.. కానరాని వైద్యులు
- 28మంది వైద్యులకుగాను ఇద్దరే విధుల నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న రోగులు



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి

మిర్యాలగూడ అర్బన్ : పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. పేదలు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులను కల్పిస్తుంది. కాని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యానికి భిన్నంగా పరిస్థితి కనపడుతుంది మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రిలో.. పట్టణంలో రోగుల సౌకర్యార్థం ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. ఆస్పత్రిలో 28మంది వైద్యులను నియమించి 24గంటలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసింది. అందుకనుగుణంగా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. కాని వైద్యులు సకాలంలో ఆస్పత్రికి రాకపోవడంతో పాటు రోజు వారి డ్యూటీ కూడా చేయడం లేదు. దీంతో చేసేది లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అందరి డ్యూటీ ఇద్దరు వైద్యులే నిర్వహణ..

ఆస్పత్రిలో 28మంది వైద్యులుండగా.. వారికి రోజు వారీ విధుల్లో భాగంగా ఆస్పత్రి రోస్టర్ ప్రకారం రాత్రి, పగలు డ్యూటీలు ఉంటాయి. కాని ఎలాంటి రోస్టర్ పద్ధతిని పాటించకుండా ఇద్దరు డ్యూటీ డాక్టర్లకు తమ డ్యూటీని అప్పగిస్తున్నారు. దానికి ప్రతిఫలంగా ఒక్కో వైద్యుడు నెలకు రూ.3వేలు సదరు డ్యూటీ చేసే ఇద్దరు వైద్యులకు ఇస్తున్నట్లు సమాచారం. విధులకు రాకుండా ఉన్న వైద్యులు ఎంచక్కా ప్రైవేట్ ఆస్పత్రులు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ వేతనంతో పాటు ప్రైవేట్‌లోనూ రెండు విధాలా సంపాదిస్తూ డ్యూటీకి డుమ్మా కొడుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులతో వైద్యుల కుమ్మక్కు..

ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు డ్యూటీ చేస్తూ అంతా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని వైద్య సిబ్బందే చెప్పడం గమనార్హం. ఆస్పత్రికి వచ్చిన రోగికి అవసరం ఉన్నా.. లేకున్నా.. కొద్దిపాటి చికిత్సకు కూడా సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ అంటూ బయట స్కానింగ్ సెంటర్లకు రిఫర్ చేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక్కోసారి అత్యవసర చికిత్స వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రుకు రిఫర్ చేస్తూ కూడా సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఏరియా ఆస్పత్రిలో వైద్యులందరూ రోస్టర్ విధానంతో డ్యూటీ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విషయం నాదృష్టికి రాలేదు



ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు మాత్రమే అందరి డ్యూటీ చేస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. విషయం తెలుసుకుని అందరు వైద్యులు డ్యూటీ చేసే విధంగా చర్యలు తీసుకుంటాను. రోగులకు అవసరమైతేనే స్కానింగ్‌లు తీయించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస సమరధ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, మిర్యాలగూడ

ఏరియా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఏరియా ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డులో తిరుగుతూ వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆస్పత్రిని సందర్శించిన సమయంలో వైద్యులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందిపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యసిబ్బందిని వైద్యుల గురించి అడగ్గా తమకు తెలియదని చెప్పడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సమరధ్‌కు ఫోన్ చేశారు. ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని వైద్యులు డ్యూటీలో లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యులకు మెమో ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పలు వార్డులను పరిశీలించి శుభ్రత లేకపోవడంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిబ్బంది తీరు మార్చుకోకుంటే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

30నుంచి నందిని నాటకోత్సవాలు



నాటకోత్సవ కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా ఈనెల 30నుంచి ఏప్రిల్ 4వరకు జాతీయ స్థాయి నందిని నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానికంగా నాటకోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వారు విడుదల చేసి మాట్లాడారు. పట్టణంలోని మినీ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఈ నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలు బృందాలు పోటీల్లో పాల్గొంటాయని, ఈ నాటిక పోటీల్లో పద్యనాటిక 9, సాంఘీక నాటికలు 12ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రతి నాటిక పోటీల్లో మొదటి బహుమతి రూ.50వేలతో పాటు బంగారు నంది, రెండో బహుమతి రూ.40వేలతో పాటు వెండి నంది, మూడో బహుమతి రూ.30వేలతో పాటు రాగినంది, అదేవిధంగా సాంఘీక నాటిక పోటీల్లో మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్న పద్య నాటక ప్రతి బృందానికి రూ.40వేలు, సాంఘీక నాటిక బృందానికి రూ.20వేలు పారితోషికం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రావు, దుర్గి శ్రీనివాస్‌శర్మ, పుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మ, మామిడాల ఉపేందర్, పరిమి రామావతారం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్ భిక్షమయ్య, ప్రోగ్రాం అధికారి కోటయ్య

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన శీతాకాల ప్రత్యేక శిబిరాలు గురువారం ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ భిక్షమయ్య మాట్లాడారు. వారం రోజులుగా వలంటీర్లు గ్రామంలో చేస్తున్న సేవలను కొనియాడారు. గ్రామంలోని వీధులను శుభ్రం చేయడంతో పాటు కంపచెట్లను తొలగించడం, వైద్యశిబిరం ఏర్పాటు చేయడం, ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారని, ఉపాధిలేని యువతపై సర్వే నిర్వహించి సర్వే రిపోర్టును అందించారని తెలిపారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నర్సింగ్ కోటయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఈ.రామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రాన్సిస్, అధ్యాపకులు జి.నరేష్, గ్రామ కార్యదర్శి విజయ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం శైలజ, ఎం.వెంకటేశ్వర్లు, చారి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

- ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు విధులను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలో మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎన్నికల అధికారులతో పాటు 264పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 85సంవత్సరాలు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులను గుర్తించి వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు ఫారం-12డి దరఖాస్తులను వారి నుంచి స్వీకరించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రూట్‌సెక్టార్ అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కొండమల్లేపల్లి : పట్టణానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, గుడితండాకు చెందిన మత్స్యశాఖ మాజీ చైర్మన్, అలాగే 50 కుటుంబాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొడిదాల వెంకటయ్య, వస్కుల శ్రీను, జబ్బు ఎల్లయ్య, సక్రు నాయక్, బాలునాయక్, రాజేందర్, జయశంకర్, తోటపల్లి కిరణ్ తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, మాడ్గుల యాదగిరి, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌నాయక్

మిర్యాలగూడ : బీజేపీ, ఆర్ఎస్ఎస్ చరిత్రను వక్రీకరిస్తున్నాయని వారి కుట్రలను తిప్పికొట్టాలని దామరచర్ల మండల సీపీఎం కార్యదర్శి వినోద్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల విడుదలైన రజాకార్ సినిమా వీర తెలంగాణ, విప్లవ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన తీరును పూర్తిగా వక్రీకరించి ప్రస్తుత సమాజానికి తప్పుడు సమాచారాన్ని, అవాస్తవాలను జోడించారన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా చిత్రీకరించిన రజాకార్ సినిమాను తక్షణమే నిలిపివేయాలని, సెన్సార్‌బోర్డు ఈ సినిమాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, ఎర్రనాయక్, కోటిరెడ్డి, సుభాని, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరి ఆరోగ్యానికి యోగా తప్పనిసరి



యోగా చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

దేవరకొండ : ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరిగా చేయాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామరాజు అన్నారు. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గురువారం చందంపేట మండల పరిధిలోని పోలేపల్లిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం యోగా విభాగం కోఆర్డినేటర్ లింగారెడ్డి ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి పలు యోగాసనాలు సాధన చేశారు. విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మకట్‌లాల్, ఆరిఫా, విద్యార్థులు తదితరులున్నారు.

ఇబ్రహీంపేటలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

హాలియా : మున్సిపాలిటీ పరిధిలో ఇబ్రహీంపేటలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) విద్యార్థులు గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు డాక్టర్లతో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల ప్రాముఖ్యతపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీహెచ్ రాజు, డాక్టర్ యామిని, కళాశాల అధ్యాపకులు కవిత, శ్రీనివాస్, ఆశవర్కర్, ఏఎన్ఎం, విద్యార్థులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

మాడుగులపల్లి : మండలంలోని గణపతివారిగూడెంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి బీజేపీ నాయకుడు సురేందర్‌రెడ్డి రూ.10వేలు విరాళంగా అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ మమత

హాలియా : చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సువర్ణ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చల్మారెడ్డిగూడెం ఉన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. చిరుధాన్యాలు, మిల్లెట్స్ పోషకాహారం, ఆరోగ్యంపై చిన్నారులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, నాగమల్లిక, విజయ, శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చింతపల్లి : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ లావణ్యకుమారి సూచించారు. గురువారం మండలంలోని వెంకటంపేట గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు రక్తహీనతతో బాధపడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, స్వప్న, లక్ష్మి, కవిత, ఆయాలు, ఆశవర్కర్లు భాగ్యమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

డిండి : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ వారోత్సవాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకారెడ్డి పాల్గొని గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లావణ్య, మంగమ్మ, చంద్రకళ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది

మిర్యాలగూడ టౌన్ : తల్లి ముర్రుపాలతో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, మొదట ఆరు నెలల వరకు ముర్రుపాలే పట్టించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత అన్నారు. గురువారం పట్టణంలోని 46వ వార్డు ఇస్లాంపురం సెక్టార్‌లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణుల సంరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 24నెలల వరకు తల్లిపాలు కొనసాగేలా వారికి గృహ సందర్శన ద్వారా వివరించారు. అనంతరం పలు అంశాలపై ఐసీడీఎస్ అధికారులు గర్భిణులు, బాలింతలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పద్మజాదేవి, షహీన్, యాదమ్మ, రషీద, నరద్మ, ఝాన్సీ, సరిత, శ్రీదేవి, ఆయాలు తదితరులున్నారు.



హాలియా : చల్మారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ సువర్ణ



డిండి : పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న రేణుకారెడ్డి

నేడు రథోత్సవం

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని రాములబండలో సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ దోమలపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. 23న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం నల్లగొండ నుంచి ఉచితంగా ప్రైవేటు బస్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్తలు దోమలపల్లి శశిధర్‌రావు, ప్రభాకర్‌రావు, హరికృష్ణ, సందీప్, మాజీ సర్పంచ్ జయమ్మ, శంకర్‌గౌడ్, సతీష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా సైదులు



నియామకపత్రం అందుకుంటున్న సైదులు

నల్లగొండ టౌన్: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా వడ్డెబోయిన సైదులు నియమితులయ్యారు. ఈమేరకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి గురువారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు.

నేడు కంటి వైద్యశిబిరం

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మ్యాక్సివిజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు ఉద్యోగులకు హెల్త్ కార్డుపై ఉచిత కంటి పరీక్షతో పాటు ఆపరేషన్లు చేస్తారన్నారు.

చైర్మన్ పీఠం దక్కేదెవరికో..?

- నేడు సాయంత్రం 4 గంటలకు హాలియా మున్సిపల్ ప్రత్యేక సమావేశం
- హాజరుకావాలని 12మంది కౌన్సిలర్లకు నోటీసులు
- ఆర్డీఓ ఆధ్వర్యంలో ఎన్నిక



హాలియా మున్సిపల్ కార్యాలయం

హాలియా : హాలియా మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు తెరపడనుంది. ఈ ఎన్నిక కోసం నేడు (శుక్రవారం) సాయంత్రం 4గంటలకు మున్సిపల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 12మంది కౌన్సిలర్లు ఉండగా వారు సమావేశానికి హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్ల సమావేశానికి హాజరు కానున్నారు. మున్సిపాలిటీలో 12మంది గాను బీఆర్ఎస్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు గెలుపొందారు. దీంతో ఎక్స్‌అఫీషియో ఎమ్మెల్యే ఓటుతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌గా వెంపటి పార్వతమ్మశంకరయ్య, వైస్‌చైర్మన్‌గా నల్లగొండ సుధాకర్ ఎన్నికయ్యారు. ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ఇద్దరు అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం ఎనిమిదికి చేరింది. దీంతో కాంగ్రెస్‌కు చెందిన 8మంది చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసి ఫిబ్రవరి 10న కలెక్టర్‌కు అందజేశారు. ఫిబ్రవరి 29న ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది.

చైర్‌పర్సన్ పోటీలో 2వ వార్డు కౌన్సిలర్..

మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన 2వ వార్డు కౌన్సిలర్ యడవెల్లి అనుపమానరేందర్ రెడ్డి చైర్‌పర్సన్‌గా పోటీలో ఉండగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన 7వ వార్డు కౌన్సిలర్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు వైస్‌చైర్మన్ పోటీలో ఉన్నారు. వారినే ఎన్నుకోవాలని మాజీ మంత్రి జానారెడ్డి కౌన్సిలర్లను ఆదేశించినట్లు సమాచారం. 12మంది కౌన్సిలర్లలో సగానికి పైగా హాజరైతేనే ఎన్నికను నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారిగా మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు.

నేడు నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నేడు జరుగనుంది. గత నెలలో వారిపై అవిశ్వాసం పెట్టడంతో నెగ్గింది. మున్సిపాలిటీలో 12మంది కౌన్సిలర్లు ఉండగా 9మంది బీఆర్ఎస్ నుంచి, ముగ్గురు కాంగ్రెస్ నుంచి గెలిచారు. అందులో కాంగ్రెస్‌కు చెందిన ఓ కౌన్సిలర్ మృతి చెందారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం ఆరుకు చేరింది. ఇందులో ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థికే చేతులు ఎత్తేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో మరో మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరనుంది.